జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 66 18-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## ఈస్ట్–వెస్ట్ కార్గో కారిడార్‌గా ఏపీ..

- నూతన పోర్టుల్లో త్వరితగతిన ఆపరేషన్లు ..
- రెండో దశ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం వేగవంతం..
- పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్షలో సీఎం చంద్రబాబు..

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పోర్టుల నుంచి కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్ల ద్వారా ఈస్ట్ –వెస్ట్ కార్గో కారిడార్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితం అవుతున్న మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల్లో త్వరితగతిన కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్లు ప్రారంభం కావాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మూడు పోర్టుల నుంచి పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల హింటర్ ల్యాండ్ నుంచి కార్గో రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు 2026 డిసెంబర్ నాటికి పూర్తి అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ కూడా ఏర్పాటైన అనంతరం కంటైనర్, బల్క్ కార్గో పోర్టుగా రామాయపట్నం మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

- మిగతా 2వ పేజీలో

## గ్యారంటీలపై
# గరం గరం

### శాసన సభలో తీవ్ర స్థాయిలో వాదోప వాదాలు



- ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా విమర్శలు,ప్రతి విమర్శలు
- ధన్యవాదాలు ఎందుకు తెలపాలన్న బీఆర్ఎస్ నేత
- ప్రభుత్వానికి, సీఎం సంతకానికి జీరో వాల్యూ అంటూ ఎద్దేవా
- కేటీఆర్ ప్రసంగిస్తుండగా జోక్యం చేసుకున్న ఐదుగురు అమాత్యులు
- ప్రభుత్వ పథకాలు ప్రస్తావిస్తూ దీటుగా జవాబు.. సభను పక్కదారి పట్టిస్తున్నారంటూ ఫైర్

హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల రెండోరోజు మంగళవారం అధికార, ప్రతిపక్ష సభ్యుల సవాళ్లు, ప్రతిసవాళ్లకు శాసనసభ వేదికైంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడే సమయంలో విపక్ష బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వర్సెస్ మంత్రులు అన్నట్టుగా సభ సాగింది. కేటీఆర్.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు చట్టబద్ధతను ప్రశ్నిస్తూ, ఆ ఆరు అంశాలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని ధ్వజమెత్తారు. కేటీఆర్‌కు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు,

- మిగతా 2వ పేజీలో



## సిట్టింగ్‌లకు టీఎంసీ షాక్

- 74 మంది ఎమ్మెల్యేలకు నో టికెట్
- ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించేందుకే అంటున్న విశ్లేషకులు
- వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకు వ్యూహం

2లో



## నాకు నయనతార కావాలి.. నా కల నెరవేరుస్తారా..?

### సీఎంను టార్గెట్ చేయబోయి ఇరుక్కుపోయిన ఎంపీ..

తమిళనాడులో రాజకీయ వర్గాల్లో ఒక వ్యాఖ్య పెద్ద దుమారాన్ని రేపింది. అన్నా డీఎంకే ఎంపీ షణ్ముగన్ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# ఇరాన్‌కు ఎదురుదెబ్బ

- ఇజ్రాయెల్ దాడుల్లో ఇద్దరు అగ్రశ్రేణి అధికారులు మృతి
- ఖమేనీ కుడిభుజం అలీ లారిజానీ, జనరల్ సులేమానీ హతం
- ఇరాన్ నాయకత్వం వెన్నెముక విరిచేశాం
- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ప్రకటన
- గల్ఫ్ దేశాలపై కొనసాగిన ఇరాన్ దాడులు
- టెహ్రాన్, బీరూట్‌పై ఇజ్రాయెల్ సైన్యం దాడి

2లో

దుబాయ్: ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. దివంగత సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి కుడిభుజంగా పనిచేసిన సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లారిజానీతోపాటు ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ)కు చెందిన బసిజ్ పారామిలటరీ ఫోర్స్ కమాండర్ జనరల్ ఘోలమ్‌రెజా సులేమానీ తమ దాడుల్లో మృతి చెందినట్లు ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం వెన్నుముక విరిచేశామని వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయెల్ సైన్యం సోమవారం రాత్రి ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై విరుచుకుపడింది.

### ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ ఘాతుకం
## ఆస్పత్రిపై దాడి.. 408 మృతి

- పాక్ ఘాతుకాన్ని ఖండించిన భారత్
- పిరికిపంద.. అమానుష దాడిగా ఖండన
- పిరికిపంద.. అమానుష దాడి.. పాక్ ఘాతుకాన్ని ఖండించిన భారత్

## డగ్ టెస్టుకు సీఎం సిద్ధం.. మరి కేటీఆర్ సిద్ధమా?

- మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన
- ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలి



2లో



## ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశాం..

- గుండె ధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్!
- కార్యకర్తలు, నాయకులతో వైఎస్ జగన్ సమావేశం
- ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశాం
- గుండె ధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్

## మైలవరం స్కూల్‌లో మంత్రి లోకేష్ ఆకస్మిక తనిఖీలు..

- మధ్యాహ్న భోజనం నాణ్యత స్వయంగా పరిశీలన..
- తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక..
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలని ఆదేశం..

2లో



# సిట్టింగ్‌లకు టీఎంసీ షాక్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని సీఎం మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అభ్యర్థుల జాబితాలో అనూహ్యంగా భారీ మార్పులకు తెరతీసింది. అసెంబ్లీలోని మొత్తం 294 సీట్లకుగాను 291 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీఎంసీ మొత్తం ఎమ్మెల్యేల్లో మూడోవంతు మంది, 74 మందికి మొండి చేయి చూపింది. వరుసగా నాలుగోసారి అధికార పీఠం చేజిక్కించుకోవాలని లక్ష్యంతో ఉన్న ఆ పార్టీ..ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించుకునేందుకే ఈ వ్యూహాన్ని అమలు చేసినట్లుగా భావిస్తున్నారు. అభ్యర్థుల జాబితాను టీఎంసీ చీఫ్, సీఎం మమతా బెనర్జీ కాళీఘాట్ నివాసంలో మంగళవారం విడుదల చేశారు. డార్జిలింగ్ హిల్స్‌లోని మిగతా మూడు స్థానాలను మిత్రపక్షమైన భారతీయ గూర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చాకు వదిలిపెట్టారు.

**బీజేపీ కోసమే ఈసీ బదిలీలు: మమత**

అభ్యర్థుల జాబితా విడుదల అనంతరం ప్రసంగించిన సీఎం మమత ఎన్నికల కమిషన్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్ సహా పలువురు అధికారులను ఎన్నికల కమిషన్ ఉన్న ఫళంగా బదిలీ చేయడాన్ని ఆమె తప్పుబట్టారు. ఈసీ ఈ బదిలీలన్నిటినీ కేంద్రంలోని బీజేపీ కోసమే చేసిందని ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో బదిలీల జాబితా తయారు కాగా, ఆ మేరకు ఈసీ అమలు పర్చిందని మమత విమర్శించారు. రాష్ట్రంలోకి బీజేపీ డబ్బు, ఆయుధాలను నిరాటంకంగా తరలించేందుకే బదిలీలు చేపట్టారని ఆరోపించారు.

## నాకు నయనతార కావాలి.. నా కల నెరవేరుస్తారా..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖ నటి నయనతార పేరును ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తమిళనాడులో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ (అన్నాడీఎంకే) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. విల్లుపురంలో జరిగిన ఈ నిరసనకు అన్నా డీఎంకే నేత, ఎంపీ సీవీ షణ్ముగన్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో లైంగిక వేధింపుల ఘటనలు పెరుగుతున్నాయని ఆరోపించారు. వాటిని అరికట్టడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో గంజాయి వ్యసనం కారణంగా హత్యలు, దోపిడీలు, ఇతర నేరాలు పెరుగుతున్నాయని కూడా ఆరోపించారు. అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించిన "మీ కలలు చెప్పండి, మేము నెరవేర్చుతాం" అనే కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ షణ్ముగం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "మీ కలలు చెప్పండి, నేను నెరవేర్చుతాను అని సీఎం అంటున్నారు. అయితే నాకు నయనతార కావాలిడ నా కలను నెరవేరుస్తారా?" అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో అక్కడ ఉన్నవారిలో చర్చ మొదలైంది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వచ్చాయి. మహిళలను అవమానించేలా మాట్లాడారని పలువురు మండిపడ్డారు.

## ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ ఘాతుకం
## ఆస్పత్రిపై దాడి.. 408 మృతి

ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ ఘాతుకానికి పాల్పడింది. సోమవారం రాత్రి కాబూల్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడికి పాల్పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 408 మంది మరణించిగా.. వందలాది మంది గాయపడ్డారు. ఈ ఘటన ప్రపంచ దేశాలు ఉలిక్కిపడేలా చేసింది. పాకిస్థాన్ చర్యను భారతదేశం తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద చర్యగా.. అమానుష దాడిగా అభివర్ణించింది. ఇది హేయమైన.. దురాక్రమణ చర్యగా పేర్కొంది. ఇది కచ్చితంగా ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దారుణమైన దాడిగా తెలిపింది. ఇది ప్రాంతీయ శాంతికి విఘాతం కలిగించిందని భారత్ ధ్వజమెత్తింది. ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజం శాంతి, కరుణతో గడిపే పవిత్ర రంజాన్ మాసంలో పాకిస్థాన్ ఇలాంటి దాడి చేయడం హేయమైన చర్యగా భారత్ అభివర్ణించింది. ఒక ఆస్పత్రిని.. రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతమూ.. ఏ చట్టమూ సమర్థించదని పేర్కొంది. ఈ నేరపూరిత చర్యను అంతర్జాతీయ సమాజం ఖండించాలని.. పాకిస్థాన్ ఘాతుకం ఆగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ విపత్కర సమయంలో ఆఫ్ఘని ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది.

## ఈస్ట్–వెస్ట్ కార్గో కారిడార్‌గా ఏపీ..

(మొదటి పేజీ తరువాయి)

రామాయపట్నం నుంచి కడప స్టీల్ ప్లాంట్ వరకూ ప్రత్యేక మార్గాన్ని వేసేందుకు కూడా రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని సీఎం చంద్రబాబు తెలిపారు. మూడు పోర్టులకు సమీపంలోనూ పోర్టు టౌన్ షిప్ ఏర్పాటు చేయడం ద్వారా వాణిజ్య పరమైన లావాదేవీలు కూడా పెరుగుతాయని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు పోర్టులకు సమీపంలో పారిశ్రామిక కారిడార్‌లు కూడా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉందన్నారు. రెండో దశలో బుడిగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్లను కూడా వేగంగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. సమీప భవిష్యత్తులో ప్రతీ 50 కిలో మీటర్లకు పోర్టు, ఫిషింగ్ హార్బర్లు రానున్న నేపథ్యంలో ఈస్ట్ కోస్టు లాజిస్టిక్స్ హబ్ గా ఏపీ మారుతుందన్నారు. ఏపీలో ఉన్న పోర్టులు కార్గో హ్యాండ్లింగ్‌లో గేమ్ ఛేంజర్‌గా మారాలని సీఎం సూచనలు చేశారు. ప్రస్తుతం యుద్ధం కారణంగా దుబాయ్, గల్ఫ్ దేశాల్లోని ఓడరేవులు ఇబ్బందుల్లో పడ్డాయని.. ఇప్పుడు భారత్ లోని ఈస్ట్ కోస్ట్ లో ఉన్న పోర్టులే సురక్షితం అన్న అభిప్రాయం వచ్చిందని ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## డ్రగ్ టెస్టుకు సీఎం సిద్ధం.. మరి కేటీఆర్ సిద్దమా?

శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేష్ గౌడ్ సవాల్ విసిరారు.

# గ్యారంటీలపై గరం గరం

సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో కౌంటర్ ఇచ్చారు.

సుమారు 1.40 గంటల పాటు మాట్లాడిన కేటీఆర్.. గవర్నర్ ప్రసంగంలోని అంశాలతో పాటు రెండున్నరేళ్ల ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో ప్రభు త్వం విఫలమైనందుకు ధన్యవాదాలు తెలపాలా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రేషన్‌కార్డుల విషయంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మధ్య సమన్వయ లోపం ఉందని వ్యాఖ్యానించారు. 6 గ్యారంటీలకు చట్టబద్ధత అన్న సీఎం సంతకానికి విలువలేకుండా పోయిందని విమర్శించారు. ఎందుకు చట్టబద్ధత కల్పించలేదని ప్రశ్నించారు. దీనిపై సిట్ వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, సీఎం సంతకానికి జీరో వాల్యూ అంటూ ఎద్దేవా చేశారు. కేటీఆర్ ప్రసంగానికి పలుమార్లు అడ్డుపడిన మంత్రులు.. ప్రతి విమర్శలకు దిగారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్, సన్నబియ్యం, మహిళలకు ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా వంటి పథకాలను ప్రస్తావించారు. గవర్నర్ ప్రసంగాన్ని చదివి ఉపన్యాసా లు ఇవ్వాలని మంత్రి శ్రీధర్‌బాబు హితవు పలికా రు. గోబెల్స్ సదస్సులో రూ.లక్షల కోట్లు పెట్టుబడు లు వచ్చాయని చెప్తున్నా, టీజీఐఐసీ గణాంకాలు అందుకు భిన్నంగా ఉన్నాయన్న కేటీఆర్ వ్యాఖ్యల పై స్పందిస్తూ.. ఎంఓయూలు కుదిరినా అవి ఆచరణలోకి వచ్చేందుకు సమయం పడుతుందంటూ వివరణ ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి.. తెల్లరేషన్‌కార్డులు, సన్న బియ్యం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశా రు. మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ బ్రిటన్ చేసిన ఆరోపణలను కేటీఆర్ ప్రస్తావించడంపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి..సీతక్కకు మద్దతుగా మాట్లాడారు. అనర్హత పిటిషన్లపై కేటీఆర్ మాట్లాడినప్పుడు మంత్రి పొంగులేటి..కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 'శోభాకృత నామ, క్రోధీకృత నామ సంవత్సరాలు పోయాయి. విశ్వావసునామ సంవత్సరం 19న పోతోంది. రేపు పరాభవ నామ సంవత్సరంలో అడుగుపెడుతున్నాం. ఈ రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మిగిలింది పరిహాసమే. ప్రతి సంవత్సరం పరిహాసనామ సంవత్సరమే. ఉగాదులు వస్తున్నయి.. పోతున్నయి. గ్యారంటీలు మాత్రం రావడం లేదు. గవర్నర్ ప్రసంగంలో గ్యారంటీలు, డిక్లరేషన్ల ఊసే లేదు. మూడో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నా రు. ప్రభుత్వ అర్ధభాగం గడిచిపోయింది. ఫస్ట్ హాఫ్ డిజాస్టర్. సినిమా పేరు అభయహస్తం.. లోపల కథ చూస్తే భస్మాసుర హస్తం అని ప్రజలకు అర్థమైంది. మూడు ముక్కల్లో చెప్పాలంటే హామీలు ఎగ్గొట్టు.. కట్టిన వాటిని కూలగొట్టు.. ఉన్న పథకాలను చెడ గొట్టు..అన్నట్టుగా కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలన ఉంది..' అంటూ బీఆర్ఎస్ సభ్యుడు కేటీ రామారావు ధ్వజమెత్తారు. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లను ఉద్దేశించి..ఈ ఆరు గ్యారంటీల (అభయ హస్తం) ఫైలు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఆ ఫైలు ఆచూకీ కోసం సిట్ వేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు.

**మీ ప్రభుత్వానికే జీరో వేల్యూ**

'ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ఫైలుపై సీఎం రేవంత్ తొలి సంతకం చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధి, సంకల్పానికి నిదర్శనమని 2023 డిసెంబర్ 15న కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన తన తొలి ప్రసంగంలో నాటి గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు. సీఎం సంతకం చేసిన ఆ ఫైల్ ఎక్కడ పోయింది? ఎఫ్ఎస్ఎల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిందా? తొలి కేబినెట్‌లోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. ఇప్పటికే 5060 కేబినెట్ సమావేశాలు జరిగినా అతీగతీ లేదు. కొంతమంది ఆస్తులకు జీరో వేల్యూ చేసినట్టు సీఎం రేవంత్ అన్నారు. సీఎం సంతకానికి, ఆయన సంతకం చేసిన ఫైల్‌కి, మీ గ్యారంటీల కార్డుకి, మీ డిక్లరేషన్లకి, విశ్వసనీయత కోల్పోయిన మీ ప్రభుత్వానికే జీరో వేల్యూ..' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'ఆరు గ్యారంటీలతో ఏటా ప్రతి కుటుంబానికి రూ.2.50 లక్షల లబ్ధి కలుగుతుందని హామీ ఇచ్చారు. ఏటా రూ.2.75 లక్షల కోట్లను కేటాయించాల్సి ఉంటుంది. ఆ మేరకు ఖర్చు చేశారా? రూ.2.5 లక్షల లబ్ధి పొందిన ఒక్క కుటుంబాన్నైనా చూపించగలరా? నేనే రాజు నేనే మంత్రి.. అని మిడిసిపడ్డ వారెవరూ సంపదలను, పదవులను మూటగట్టుకుని పోలేదని భాగవతంలో బలి చక్రవర్తి అన్నారు..' అని కేటీఆర్ గుర్తు చేశారు.

## మైలవరం స్కూల్‌లో మంత్రి లోకేష్ ఆకస్మిక తనిఖీలు..

ఎన్టీఆర్ జిల్లా, మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల మధ్యాహ్న భోజనం బాగాలేదంటూ పాఠశాల హెచ్ఎం డ్రామా ఆడించిన ఘటన నేపథ్యంలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం నాణ్యతపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు చెప్పారు. ఘటన జరిగిన రోజు, అంతకు ముందు భోజనం ఎలా ఉందని విద్యార్థులను మంత్రి అడిగారు. భోజనం బాగాలేకపోతే ముందు తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత భోజనం నాణ్యతపై లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ఇంకోసారి తప్పు జరగకుండా చూసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల మధ్యాహ్న భోజనం సరిగా లేదంటూ ఆహారాన్ని విద్యార్థులు డస్ట్ బిన్ లో పడేసిన ఘటనపై సిబ్బందిని ఆరా తీశారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలిస్తున్నారా అని వాకబు చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మీ పై పవిత్ర బాధ్యత ఉంది. చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని, నిర్లక్ష్యంగా ఎవరూ వ్యవహరించవద్దని హెచ్చరించారు. భోజనం నాణ్యతపై ప్రతివారం తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యాబోధన తీరు, పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని, అంగన్ వాడీ కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మైలవరం ఘటన నేపథ్యంలో విద్యార్థులకు అందే మధ్యాహ్న భోజనం పథకంపై ఇటీవల సమీక్షించిన మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలించాలని, బాగుందని నిర్ధారించాకే విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. వారంలో ఒకరోజు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో ఒక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలన్నారు.

## ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశాం..

ఒంగోలు నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, వాటిలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఒక్కరిది కాదని, వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రేమించే ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా నిర్మించిన పార్టీ అని జగన్ పేర్కొన్నారు. పార్టీ విలువలు, విశ్వసనీయత మీదే పుట్టిందని.. అదే పునాదులపై ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. గత 16 సంవత్సరాల్లో ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశామని, గుండెధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్ జగన్ చెప్పారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను తుచా తప్పకుండా అమలు చేశామని తెలిపారు. మేనిఫెస్టోను కచ్చితంగా పాటిస్తూ ముందుగానే క్యాలెండర్ ప్రకటించి పథకాలను అమలు చేసినట్టు గుర్తు చేశారు. ఆర్థిక ఒత్తిళ్లు, కోవిడ్ వంటి సంక్షోభాల మధ్య కూడా పేదలు, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచామన్నారు. వైసీపీ హయాంలో తీసుకున్న అప్పుల్లో పెద్ద భాగాన్ని నేరుగా ప్రజల ఖాతాల్లోకి పంపించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ.. సీఎంచంద్రబాబు హామీలను నిలబెట్టుకోలేకపోయారని వైఎస్ జగన్ ఆరోపించారు. రెండేళ్లలోనే భారీ అప్పులు చేసినప్పటికీ ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటిని వినియోగించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ పథకాలను రద్దు చేసి ప్రజలను నిరాశపరిచారని అన్నారు. అమరావతి అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదని, దోపిడీ పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని విమర్శించారు. ఈ సందర్భంగా చుండూరు రవికి తన పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలతో మరింత దగ్గరగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని జగన్ సూచించారు.

# ఇరాన్‌కు ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

అత్యున్నత సైనికాధికారులు నివాసం ఉండే కీలక స్థావరాలపై క్షిపణలు, డ్రోన్లు ప్రయోగించింది. ఈ దాడుల్లో అలీ లారిజానీ, ఘోలమ్‌రెజా సులేమానీ సహా పలువురు మృతిచెందారు. అయితే, ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ఇంకా ధ్రువీకరించలేదు. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో సుప్రీం లీడర్ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. తర్వాత ఇరాన్ తమ అగ్రశ్రేణి అధికారులను కోల్పోవడం ఇదే మొదటిసారి. మరోవైపు ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపై ఇరాన్ సైన్యం వైమానిక దాడులు కొనసాగింది. మంగళవారం తెల్లవారుజామున ఇరాన్ రెండు క్షిపణుల ప్రయోగించిట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. యూఏఈలోని దుబాయ్‌పై ఇరాన్ క్షిపణులు దూసుకొచ్చాయి. దాంతో ముందుజాగ్రత్తగా దుబాయ్ గగనతలాన్ని కొద్దిసేపు మూసివేశారు. అబూదాబీపై ఇరాన్ విరుచుకుపడింది. ఇరాన్ మిస్సైల్‌ను అబూదాబీ సైన్యం కూల్చివేసింది. ఈ శకలాల కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. గల్ఫ్ దేశాల చమురు కేంద్రాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటోంది. ఫుజైరా తీరంలో నిలిచి ఉన్న చమురు ట్యాంకర్‌పై తాజాగా డ్రోన్‌తో దాడికి దిగింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. హార్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు విడవడం లేదు. అక్కడ చమురు రవాణాపై ఆంక్షలు కొనసాగించడం తప్ప మరో మార్గం లేదని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఖలిబాఫ్ తేల్చిచెప్పారు. తమ దేశంపైకి రాకెట్లు, క్షిపణులు దూసుకొస్తున్నాయని, తాము ప్రతిస్పందించకుండా మౌనంగా ఉండిపోవాలా? అని ప్రశ్నించారు. ఇరాన్ మంగళవారం ఉదయం పదుల సంఖ్యలో డ్రోన్లు ప్రయోగించిందని, వాటిని మధ్యలోనే తుత్తునియలు చేశామని సౌదీ అరేబియా రక్షణ శాఖ వెల్లడించింది. ఖతార్‌లో భారీ ఎత్తున పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాన్ క్షిపణుల దండును విజయవంతంగా అడ్డుకున్నట్లు ఖతార్ రక్షణశాఖ తేల్చిచెప్పింది. అయితే, క్షిపణుల శకలాలు నేలకూలడంతో మంటలు చెలరేగాయి. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా ఎంబసీపైనా దాడి జరిగింది. నాలుగు డ్రోన్లను ఎంబసీ గగనతల రక్షణ వ్యవస్థ కూల్చివేసింది. లెబనాన్‌లోని హెజ్‌బొ‘ల్లా మిలిటెంట్లు ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడికి దిగారు. పలు డ్రోన్లు ప్రయోగించారు.

**లెబనాన్‌లో ఇద్దరు జవాన్లకు గాయాలు**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. టెహ్రాన్‌తోపాటు లెబనాన్ రాజధాని బీరూట్‌పై పెద్ద ఎత్తున క్షిపణులు ప్రయోగించింది. కమాండ్ సెంటర్లు, మిస్సైల్ లాంచింగ్ కేంద్రాలు, గగనతల రక్షణ వ్యవస్థలపై దాడికి దిగింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇజ్రాయెల్ సేనలు దక్షిణ లెబనాన్‌లోకి చొచ్చుకొస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇరుపక్షాల మధ్య భీకర యుద్ధం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఇజ్రాయెల్‌తో ప్రత్యక్షంగా చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు లెబనాన్ ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ, లెబనాన్ సైన్యం అందుకు ఒప్పుకోవడం లేదు.

అలీ లారిజానీ ఘనమైన నేపథ్యం ఉంది. ఇరాన్‌లో ప్రముఖ రాజకీయ కుటుంబంలో జన్మించారు. పార్లమెంటరీ స్పీకర్‌గా పనిచేశారు. ఇరాన్ సాంస్కృతిక మంత్రిగా వ్యవహారించార. ప్రజలపై ఆంక్షలను కఠినతరం చేశారు. ప్రభుత్వానికి విధానపరమైన సలహాదారుగా సేవలందించారు.



## రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

- 25వ తేదీ వరకు రైతు భరోసా దరఖాస్తులకు గడువు
- కొత్తగా పట్టా పొందిన రైతులకు అవకాశం
- గతంలో లబ్ధి పొందని రైతులు కూడా అర్హులు
- అప్లికేషన్‌తో పాటు అవసరమైన పత్రాలు సమర్పించాలి
- చౌటుప్పల్ మండలంలో 553 మంది కొత్త పట్టాదారులు
- రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలి
- మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు



**చౌటుప్పల్, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** యాసంగి సీజన్ (2025-26) కు సంబంధించి రైతు భరోసా పథకం లబ్ధి పొందేందుకు కొత్త దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) ముత్యాల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28, 2026 నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈ పథకానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. గతంలో పాస్ పుస్తకాలు ఉండి, వివిధ కారణాలతో రైతు భరోసా పొందని వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

**దరఖాస్తు విధానం:**

అర్హులైన రైతులు నిర్ణీత దరఖాస్తు ఫారంతో పాటు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతిని జత చేయాలి. వీటిని ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులకు (ఏఈఓ) అందజేయాల్సి ఉంటుంది.

**గడువు తేదీ:**

దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 25వ తేదీని (25-03-2026) చివరి గడువుగా నిర్ణయించారు. చౌటుప్పల్ మండల వ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన 553 మంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

## శాంతియుతంగా రంజాన్ వేడుకలు జరుపుకోవాలి

- యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్



**రాజపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్ అన్నారు. మంగళవారం రాజపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగ వేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. హిందూ, ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సౌహార్ద వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని, సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజాపేట ఎస్ఐ లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.


## ఘనంగా కూతురు లింగం జన్మదిన వేడుకలు

- సాయి మందిరంలో ప్రత్యేక పూజలు
- శాలువాతో సత్కరించిన తిరుమలేష్

**రాజపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచి, బీఆర్ఎస్ నాయకుడు కూతురు లింగం జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన స్థానిక శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆయనకు గోత్రనామార్చనలు చేసి, స్వామివారి శేష వస్త్రంతో ఆశీర్వదించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్‌లు లింగంకు శుభాకాంక్షలు తెలిపి, చేనేత శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఉప్పల రమేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొని మిఠాయిలు పంచి శుభాకాంక్షలు అందజేశారు.



# ప్రజాసేవకు దక్కిన అరుదైన అవకాశం





- చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మొగుదాల పావని రమేష్ గౌడ్ బాధ్యతల స్వీకరణ
- వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** వేల సంఖ్యలో ఆశావహులు ఉన్నప్పటికీ, దేవుడు మీకు ప్రజాసేవ చేసే గొప్ప అవకాశాన్ని కల్పించారని, దీనిని సద్వినియోగం చేసుకుని మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చైర్‌పర్సన్‌ను ఆమె ఛాంబర్‌లో కూర్చోబెట్టి ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో మహిళా కౌన్సిలర్లు అధిక సంఖ్యలో గెలవడం శుభపరిణామమని, మహిళలు ఆదిపరాశక్తి స్వరూపులని కొనియాడారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నూతన పాలకవర్గం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను, పాలకవర్గాన్ని ఆదేశించారు. అనంతరం 46 మంది లబ్ధిదారులకు రూ. 46,05,336 లక్షల విలువైన కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.





# చౌటుప్పల్ ప్రగతికి బాటలు వేద్దాం



- మౌలిక వసతుల కల్పనే ధ్యేయం కావాలి: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- లక్కారంలో నూతన పాలకవర్గానికి ఘన సన్మానం
- చౌటుప్పల్‌లో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి భారీ ర్యాలీ
- పెరుగుతున్న జనాభాకు తగిన మౌలిక వసతులు అవసరం
- అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలి: ఎమ్మెల్యే

**చౌటుప్పల్, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గ సన్మానం, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతాభివందన సభ మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం ఎస్ఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం నుంచి లక్కారం ఎస్ఎంఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కూడా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీ గెలుపులో సమన్వయంతో పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు నిరుత్సాహపడవద్దని, వారికి కూడా తన పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో గెలుపోటములు సహజమని, అందరం కలిసి ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. చౌటుప్పల్ ప్రాంతంలో భూమి, నీటి, వాయు కాలుష్యం పెరుగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో అధికారిక లెక్కలకంటే ఎక్కువగా లక్షకు పైగా జనాభా ఉన్నందున, ఆ జనాభాకు సరిపడా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అవుటర్ రింగ్ రోడ్ సమీపంలో ఉండటంతో పాటు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే ప్రాజెక్టులు రావడంతో రాబోయే రోజుల్లో చౌటుప్పల్ కీలక ప్రాంతంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికను దూరదృష్టితో తీసుకున్న నిర్ణయమని తెలిపారు. కులాల ఆధారంగా రాజకీయాలు చేసేవారు కొంతకాలమే ఉంటారని, మానవత్వంతో పని చేసే వారే ప్రజల్లో చెరగని ముద్ర వేస్తారని అన్నారు. అధికారాన్ని, పదవిని బాధ్యతగా స్వీకరించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో నిజాయితీగా కష్టపడే వారిని అధిష్టానం గుర్తిస్తుందని, రాబోయే రోజుల్లో వారికి తగిన గుర్తింపు, పదవులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల్లో ఉండి నిజాయితీగా పనిచేసే వారే ఎమ్మెల్యేలుగా ఎదగాలనే తన ఆలోచన అని తెలిపారు. తెలంగాణ రాజకీయాల్లో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత తనలాంటి వ్యక్తులపై ఉందని, పేద ప్రజలకు న్యాయం జరగాలంటే మార్పు అవసరమని అన్నారు. తాను రాజకీయాలు డబ్బు సంపాదించడానికి చేయడం లేదని, ప్రజల కోసం పోరాటం చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నాగవల్లి దళార్చనతో మురిసిన వాయుపుత్రుడు!

- మంగళవారం క్షేత్రపాలకుడికి విశేష అర్చనలు..
- వేదమంత్రాలతో ప్రతిధ్వనించిన ప్రాంగణం

**యాదగిరిగుట్ట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామి వారికి పత్ర పూజ (ఆకు పూజ) అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం కావడంతో స్వామివారికి విశేష పూజలు చేసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజామునే ఆలయ అర్చకులు స్వామి వారికి మన్యుసూక్తం పారాయణంతో పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్రాలతో, రంగురంగుల పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. విశేషంగా తమలపాకులతో 'నాగవల్లి దళార్చన' నిర్వహించి, స్వామివారికి చందన అలంకారం చేశారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు హారతినిచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు పలువురు భక్తులు విష్ణు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.





# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

- 22ఏ జీవోను రద్దు చేయాలని బిజెపి డిమాండ్
- రాజాపేట తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

**రాజపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను తక్షణమే అమలు చేయాలని, వివాదాస్పదంగా మారిన 22ఏ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజాపేట సర్పంచ్ కోయ మధు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పకీరు రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని విమర్శించారు. రైతులు, సామాన్యులకు ఇబ్బందిగా మారిన 22ఏ జీవోను రద్దు చేయడంలో జాప్యం చేయవద్దని కోరారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాడి పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

- మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం. చంద్రారెడ్డి
- మల్లగూడెంలో ఉచిత టీకాల పంపిణీ



**రాజపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** పాడి రైతులు తమ పశుసంపదను కాపాడుకునేందుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం. చంద్రారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని మల్లగూడెంలో జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గడమే కాకుండా, పశువులు మేత తినక జ్వరంతో నీరసిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. చూడి పశువులు ఈడ్చుకుపోయే ప్రమాదం ఉందన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా పశువుల సంరక్షణలో జాగ్రత్తలు వహించాలని కోరారు. పశువులకు రోజుకు 70 నుంచి 100 లీటర్ల మంచినీరు అందుబాటులో ఉంచాలని, షెడ్లపై ఎండుగడ్డి పరచడం లేదా తెల్లని పెయింట్ వేయడం ద్వారా ఉష్ణోగ్రతను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జన్నెపల్లి బాలరాజురెడ్డి, పశువైద్య సిబ్బంది రవి, సిద్దులు, శ్రీకాంత్, గోపాలమిత్ర రామచందర్ పాల్గొన్నారు.

# పంతంగి టోల్ గేట్ వద్ద భారీగా గంజాయి పట్టివేత

- ఆటోలో తరలిస్తున్న 60 కిలోల సరుకు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు.. విలువ రూ. 25 లక్షలు

**రామన్నపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** పంతంగి టోల్గేట్ వద్ద ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన వాహన తనిఖీలలో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. ఆటోలో తరలిస్తున్న 60.685 కిలోల ఎండు గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నిషేధ మరియు ఎక్సైజ్ అధికారి ఎం. విష్ణుమూర్తి ఆదేశాల మేరకు రామన్నపేట ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఆర్. బాళోజి నాయక్, మోత్కూర్ ఎస్‌హెచ్‌ఓ కె. రవిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పంతంగి టోల్గేట్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా వస్తున్న ఒక ఆటోను ఆపి పరిశీలించగా అందులో పెద్ద మొత్తంలో ఎండు గంజాయి లభ్యమైంది. ఈ కేసులో గంగా బాయ్ పాండు రంగ్ చౌహన్, కమల్ అర్జున్ మోహితే, విజయ్ ఆసరం గోరపడే (మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన వారు), అలాగే వల్లపు దాసు వేణు కుమార్ (నల్గొండ)లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారు ఒడిశా రాష్ట్రంలోని భరంపూర్ నుంచి హైదరాబాద్ మార్గంగా మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన గంజాయి, ఒక ఆటో, రెండు సెల్‌ఫోన్లు మరియు నిందితులను స్వాధీనం చేసుకుని రామన్నపేట ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు ఎన్. శంకర్, బి. శివకృష్ణ, పి. సత్యనారాయణతో పాటు కానిస్టేబుళ్లు తిరుమలేష్, రావోజీ, అనిల్, కృష్ణారెడ్డి, గోపీనాథ్ రెడ్డి, వెంకట్, రహమాన్, రమేష్ రెడ్డి, సోనీ, స్వప్న పాల్గొన్నారు.



# హోరెత్తిన 'వంద పడకల' నినాదం.. రామన్నపేటలో ఆగని పోరు!

- హామీ ఇచ్చేదాకా దీక్ష విరమించేది లేదు
- రెండో రోజుకు చేరిన సీపీఎం నిరవధిక దీక్ష
- క్షీణిస్తున్న దీక్షాకారుల ఆరోగ్యం.. అధికారుల్లో చలనం శూన్యం
- పలు సంఘాల సంఘీభావం.. ఉధృతమవుతున్న ఉద్యమం
- అవసరమైతే రామన్నపేట బంద్: జిల్లెల పెంటయ్య

**రామన్నపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేటలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు దీక్షలను విరమించేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జిల్లెల పెంటయ్య స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సీపీఎం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. రెండో రోజుకు చేరిన ఈ దీక్షలకు మండలంలోని వివిధ రంగాల సంస్థలు, ప్రజల నుంచి రోజురోజుకూ మద్దతు పెరుగుతోందని పేర్కొన్నారు. దీక్ష శిబిరాన్ని వివేకానంద డివైన్ మోడల్ స్కూల్, డాన్ బాస్కో స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థులు, మండల పాత్రికేయులు, మండల మెడికల్ షాప్స్ (కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్) అసోసియేషన్ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, లాయర్స్ యూనియన్ ప్రతినిధులు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు, పూలబండ్ల దుకాణాల మహిళలు తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఒకవైపు దీక్షలో పాల్గొంటున్న నాయకుల ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ ప్రభుత్వం లేదా అధికారులు స్పందించకపోవడం బాధాకరమని పెంటయ్య విమర్శించారు. వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో రామన్నపేట మండల బంద్‌కు పిలుపునిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ల నరసింహాచారి, కందుల హనుమంతు, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, గొరిగె సోములు, వేముల సైదులు, శానగొండ రాము పాల్గొన్నారు. మద్దతు తెలిపిన వారిలో వివేకానంద డివైన్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ తిరగడం మల్లికార్జున్, పిట్టల మత్స్యగిరి, రాపోలు రమేష్, నరసింహ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఈర్లపల్లి మల్లయ్య,



మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి, లాయర్స్ యూనియన్ సభ్యులు మామిడి వెంకటరెడ్డి, పాల్వంచ జగతయ్య, శంకరమ్మ, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

**క్షీణిస్తున్న దీక్షాకారుల ఆరోగ్యం:**

నిరవధిక దీక్షలో పాల్గొంటున్న కొంతమంది నాయకుల ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు తెలిపారు. ఒకరికి రక్తపోటు స్థాయిల్లో మార్పులు కనిపిస్తున్నాయని, మరో ఇద్దరికి షుగర్ స్థాయిలు తగ్గుతున్నాయని ఆందోళన



వ్యక్తం చేశారు. దీక్షల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బల్బురి అంజయ్యతో పాటు గన్నెబోయిన విజయభాస్కర్, గాదె నరేందర్, పులి భిక్షం, ఎండి రషీద్, బొడిగె రజిత, నీల ఐలయ్య, మునుకుంట్ల లెనిన్, పావురాల మత్స్యగిరి, గంటపాక శివకుమార్, పుట్టల ఉదయ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.













# పంచాయతీ కార్మికుల 'చలో ఇందిరా పార్క్' భగ్నం

- నిర్బంధాల మధ్య అరెస్టయిన యూనియన్ నాయకులు
- అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరు: బందెల బిక్షం

**రామన్నపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల బిక్షం, రామన్నపేట మండల అధ్యక్షుడు గాదె ఎల్లయ్యలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని, అశాస్త్రీయమైన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మతసామరస్యానికి ప్రతీకగా పండుగలు

- రామన్నపేట ఎస్ఐ నాగరాజు
- పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం

**రామన్నపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** రాబోయే పండుగలను కులమతాలకు అతీతంగా, స్నేహభావంతో జరుపుకోవాలని రామన్నపేట ఎస్ఐ డి. నాగరాజు కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. రంజాన్ అనంతరం వచ్చే ఉగాది, శ్రీరామనవమి పండుగలను కూడా అందరూ కలిసిమెలిసి జరుపుకొని సామరస్యాన్ని చాటాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు సురేందర్, కమలాకర్, రాఘవేంద్ర, రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ రమేష్, ఎండీ అన్వర్, వనం చంద్రశేఖర్, పోషబోయిన మల్లేశ్, కందుల సాయి, బత్తిని ఉపేందర్, ఊట్కూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.





# మండుతున్న గ్యాస్.. తగ్గేదెన్నడు?

- సిలిండర్ ధరల పెంపుపై సీపీఐ నిరసన
- రామన్నపేట సుభాష్ సెంటర్ వద్ద ధర్నా

**రామన్నపేట, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** దేశవ్యాప్తంగా నిరంతరం పెరుగుతున్న గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే నియంత్రించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. సుభాష్ సెంటర్ వద్ద పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో చమురు సంక్షోభం తలెత్తిందని విమర్శించారు. అంతర్జాతీయంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల వల్ల సామాన్యులపై భార పడుతోందని, వెంటనే యుద్ధాలను ఆపాలని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువులతో పాటు పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రామచంద్రు, నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివరాత్రి సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షుడు ఊట్కూరి కృష్ణతో పాటు ఊట్కూరి భగవంత్, ఏనుతుల రమేష్, గంగాపురం యాదయ్య, బాలగోని మల్లయ్య, గంగాపురం వెంకటయ్య, వీరమల్ల ముత్తయ్య, జగన్నాథం పంతులు, మల్లేశం, ఊట్కూరి శ్రీను, గోశిక నవీన్, ఊట్కూరి శంకర్, పెండెం రవీందర్, గాలయ్య, జెల్లా అంబదాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.






# గోవుల అక్రమ రవాణా గుట్టురట్టు!

- వలిగొండలో లారీ పట్టివేత.. ఇద్దరి అరెస్టు
- కాకినాడ నుంచి జహీరాబాద్‌కు తరలిస్తుండగా తనిఖీలు



**వలిగొండ, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** అక్రమంగా తరలిస్తున్న గోవుల వాహనాన్ని వలిగొండ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి జహీరాబాద్‌కు గోవులను తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో టీఎస్ 05 యూసి 6984 నెంబర్ గల లారీని ఆపి తనిఖీ చేయగా, అందులో సుమారు 50 గోవులను గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా, అత్యంత క్రూరంగా వాహనంలో తరలిస్తున్న గోవులను పోలీసులు రక్షించారు. లారీ డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# బూనాదిగాని కాలువకు గోదావరి జలాలు

- కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ శ్రేణుల పాలాభిషేకం
- కాళేశ్వరం ప్రాజెక్టుతోనే సాగునీరు: తుమ్మల వెంకటరెడ్డి



**వలిగొండ, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు మండలంలోని బూనాదిగాని కాలువకు చేరుకోవడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పహిల్వాన్ పురంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ దూరదృష్టి వల్లే నేడు బీడు భూములకు సాగునీరు అందుతోందని అన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ వంటి భారీ రిజర్వాయర్ల నిర్మాణం కేసీఆర్ పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. భువనగిరి నియోజకవర్గ ప్రజలకు శాశ్వతంగా సాగునీటి కష్టాలు తీర్చాలనే సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సుమారు రూ. 2,000 కోట్లతో బస్వాపురం రిజర్వాయర్ నిర్మించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, పలుసం రమేష్, ఎలిమినేటి జంగారెడ్డి, కొమురెల్లి సంజీవరెడ్డి, పడమటి మమత నరేందర్ రెడ్డి, దేశబోయిన సూర్యనారాయణ, ఆవుల నరసింహ, బొడిగే లింగస్వామి, పైళ్ల మల్లారెడ్డి, బుగ్గ మల్లేశం, నక్కల నరేందర్ రెడ్డి, గుమ్మడి జంగారెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికలాంగులకు బడ్జెట్‌లో ఐదు శాతం కేటాయించాలి

- సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలి
- ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్



**వలిగొండ, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా వికలాంగుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో కనీసం ఐదు శాతం నిధులు వెంటనే కేటాయించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. వలిగొండ మండలం నెమలి కాలువ గ్రామంలో నిర్వహించిన ఎన్‌పీఆర్‌డీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగులకు బడ్జెట్ లేకపోవడం వల్ల సర్టిఫికెట్లు పొందినప్పటికీ చాలా మంది ఐదేళ్లుగా పెన్షన్లు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బడ్జెట్ కేటాయించి పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వికలాంగులకు పరికరాలు అందించేందుకు ఇప్పటికే మూడు దఫాలుగా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ బడ్జెట్ లేక ఇప్పటివరకు పంపిణీ జరగలేదని తెలిపారు. వెంటనే పరికరాలు అందజేయడంతో పాటు ఉపాధి అవకాశాల కోసం రుణాలు, పెట్టుబడులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు నెలకు రూ.6,000 పెన్షన్ అందజేయాలని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కూడా ఆయన కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ వలిగొండ మండల అధ్యక్షురాలు బర్ల పార్వతమ్మ, నెమలి కాలువ గ్రామ అధ్యక్షుడు పర్వతం అంజయ్య, ఉపాధ్యక్షుడు పిట్టల మహేందర్, ప్రధాన కార్యదర్శి నిడిగొండ శివ, సహాయక కార్యదర్శి ఎదురుగట్ల యాదమ్మ, కోశాధికారి వంగాల కుమార్తో పాటు పర్వతం శాంతకుమారి, జానీ దయాకర్, సబిత, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులో జనం క్యూ.. దాబాలో క్యాషియర్ 'సిట్టింగ్'!

- పోచంపల్లి ఎస్‌బీఐలో వింత పోకడలు
- ప్రశ్నిస్తే కులం పేరుతో దూషణలు.. సామాన్యుల ఆగ్రహం
- దురుసు ప్రవర్తనపై అధికారులకు బాధితుల ఫిర్యాదు






**భూదాన్ పోచంపల్లి, మార్చి 17 (తొలివెలుగు న్యూస్) :** బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రజలకు సేవ చేయాల్సిన బ్యాంకు అధికారి విధి నిర్వహణను పక్కనబెట్టి మద్యం సేవిస్తూ పట్టుబడిన ఘటన భూదాన్ పోచంపల్లిలో చర్చనీయాంశంగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి మంగళవారం డ్యూటీ సమయంలో స్థానిక దాబాకు వెళ్లి మద్యం సేవిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బ్యాంకు పనుల కోసం ఖాతాదారులు క్యూలైన్లో వేచి ఉండగా, మధ్యాహ్న భోజన విరామం పేరుతో దాబాకు వెళ్లిన క్యాషియర్ అక్కడ మద్యం సేవించినట్లు సమాచారం. ప్రభుత్వ రంగ బ్యాంకులో కీలకమైన క్యాషియర్ పదవిలో ఉండి విధి సమయంలో మద్యం సేవించడంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో దాబాలో ఉన్న క్యాషియర్‌ను ఓ వ్యక్తి పలకరించగా, అతనిని కులం పేరుతో దూషించినట్లు బాధితుడు ఆరోపిస్తున్నారు. బ్యాంకులో కూడా ఈయన ప్రవర్తన సరిగా ఉండదని ఖాతాదారులు వాపోతున్నారు. ఇటీవల ఒక వ్యక్తి తన ఖాతాలో డబ్బులు జమ చేయడానికి వెళ్లగా "నేను తీసుకోను.. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. లావాదేవీల కోసం వచ్చే ఖాతాదారులను గంటల తరబడి వేచి ఉండేలా చేయడం, ప్రశ్నిస్తే ఆగ్రహంగా స్పందించడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజా ధనాన్ని సంరక్షించాల్సిన బ్యాంకు అధికారులు ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై బాధితుడు బ్యాంకు మేనేజర్ రాకేశ్ కు ఫిర్యాదు పత్రం అందజేసినట్లు సమాచారం.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం :**

ఈ ఘటనపై బ్యాంకు మేనేజర్ రాకేశ్ స్పందిస్తూ క్యాషియర్ ప్రవర్తనపై గతంలో కూడా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఖాతాదారులతోనే కాకుండా తోటి ఉద్యోగులతో కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు, తాజాగా వచ్చిన ఫిర్యాదును కూడా వారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# జనాభా గణనను పక్కాగా నిర్వహించాలి





- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశం
- ముగిసిన చార్జ్ అధికారుల శిక్షణ

**యాదాద్రి భువనగిరి, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** జనాభా గణన2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ఛార్జ్ అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. మంగళవారం జనాభా గణనసెన్సెస్ 2027కు సంబంధించి చార్జ్ అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభా గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదట నిర్వహించే హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కచ్చితంగా పూర్తి చేస్తే సెన్సెస్ పనిలో ముఖ్య భాగం పూర్తైనట్టేనని పేర్కొన్నారు. బ్లాక్‌ల వారీగా సిబ్బందిని ఏర్పాటు చేసి సెన్సెస్ ప్రక్రియను సులభతరంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి దశను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా నిర్వహిస్తూ సమగ్ర సమాచార సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డిజిటల్ విధానంలో జరగనున్న ఈ జనాభా గణనలో ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైన ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని కోరారు. అలాగే ప్రజల సహకారం కూడా అత్యంత కీలకమని, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను సెన్సెస్ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మరియు జిల్లా గణాంక అధికారి వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- యువత మత్తుకు బానిస కాకుండా అవగాహన కల్పించాలి
- కళాశాలలు, పరిశ్రమలపై ప్రత్యేక నిఘా ఉండాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి, మార్చి 17 (తొలివెలుగు న్యూస్ :** జిల్లాను డ్రగ్స్, మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. మంగళవారం మినీ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డ్రగ్స్ నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా విద్యాశాఖతో పాటు ఇతర సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండేందుకు ముందస్తుగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం లేదా రవాణాలో పాల్గొన్న వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలేజీలు, ఫ్యాక్టరీలు, గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారి భవిష్యత్తు నాశనం అవుతుందని అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్, గ్రామపంచాయతీ స్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణా, సరఫరాపై ఇప్పటికే పోలీసులు 7 కేసులు, ఎక్సైజ్ శాఖ 3 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో డ్రగ్స్, గుడుంబా, మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ కాలేజీలు, ఫ్యాక్టరీలు, గ్రామాల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

- దండు మల్కాపురంలో ఘటన.. వివరాల కోసం పోలీసుల అన్వేషణ

**చౌటుప్పల్, మార్చి 17 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని దండు మల్కాపురం గ్రామ ఊర చెరువులో మంగళవారం సాయంత్రం ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 35 నుంచి 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం చెరువులో తేలుతుండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

**మృతుడి గుర్తింపు చిహ్నాలు:**

మృతుడు సుమారు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, చామన ఛాయ రంగు, బలమైన దేహదారుఢ్యం కలిగి ఉన్నాడు. గుండ్రని ముఖం, పెదవి కింద పాత గాయం గుర్తుంది. కుడి ఛాతిపై పుట్టుమచ్చ ఉంది. జుట్టు నలుపు, తెలుపు రంగులో చిన్నగా ఉంది. మృతుడు మిక్స్‌డ్ లైన్స్ హాఫ్ హ్యాండ్ టీ-షర్ట్, గులాబీ రంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. కుడి చేతికి ఎరుపు రంగు దారం, నడుముకు నలుపు రంగు మొలతాడు ఉన్నాయి. గ్రామ కారోబార్ పర్వతం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉపేందర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తుపడితే 8712662744 లేదా 8712553699 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ జి. మన్మథ కుమార్ కోరారు.

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా లోన్వెల్లి పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవత**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా
సిర్పూర్(టి)మండల కేంద్రంలోని లోన్వెల్లి లో ఉన్న పీహెచ్సీ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ నవత ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మెగా మెగా హెల్త్ క్యాప్ నిర్వహించారు.ఈ మెగా హెల్త్ క్యాంపులో స్పెషలిస్ట్ డాక్టర్స్ డాక్టర్ గిరీష్ జనరల్ మెడిసిన్, డాక్టర్ నవ్య శ్రీ ఎంఎస్,ఓబిఎస్ స్త్రీల వైద్య నిపుణురాలు (గైనకాలజిస్ట్) డాక్టర్ దేవేందర్ ఆర్థోపెడిక్, డాక్టర్ సాయి కిరణ్ పెడియేట్రిక్, డాక్టర్ విశాఖ అఫ్జల్, పాల్గొని డాక్టర్ నవతతో కలిసి మెగా హెల్త్ క్యాంప్ .

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





# ప్యారడైజ్ వచ్చేది ఆరోజే!

ముందు ప్రకటించిన తేదీలో కాకుండా, వేరే తేదీలో విడుదల కావడం సినిమాలకు పరిపాటే. ఇప్పుడు ఆ జాబితాలో నాని 'ది ప్యారడైజ్' సినిమా కూడా చేరింది. గతంలో ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 26న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. అయితే.. మారిన సమీకరణాలు, ఆ సమయంలో విడుదల కానున్న సినిమాలు, 'ది ప్యారడైజ్' సినిమా షూటింగ్ ప్రోగ్రెస్.. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ఈ సినిమాను ఆగస్ట్ 21కి వాయిదా వేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ గురువారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నది. నాని ఇంట్రడక్షన్ సాంగ్‌ని వందమంది డ్యాన్సర్లతో భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. నాని పాత్రలోని రా ఎనర్జీకి సరిపోయేలా హై ఓల్టేజ్ బీట్‌తో అనిరుథ్ ఈ పాటను స్వరపరిచారని, సుధన్ మాస్టర్ కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్ అనీ మేకర్స్ తెలిపారు. బ్లాక్‌బస్టర్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై అంచనాలు భారీగా ఉన్నాయి. శ్రీవెంకటేశ్వర సినిమాస్ పతాకంపై చెరుకూరి సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌బాబు విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. సంపూర్ణేష్‌బాబు, రాఘవ్ జుయల్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సీహెచ్ సాయి.



# ఇది అరుదైన కలయిక

'ఇందులో నా పాత్ర పేరు మిత్ర. తను సరదాగా ఉండే మధ్యతరగతి అమ్మాయి. బాగా మాట్లాడుతుంది. అనుకున్నది చేసేస్తుంది. కొత్తగా ఆలోచిస్తుంది. జాబ్ కోసం చెన్నై వస్తుంది. ఇందులో 'చెప్తా చెప్తా..' అనేది నా ఊతపదం. సినిమా పూర్తయ్యేలోపు ఈ మాట చాలాసార్లు వింటారు. దర్శకుడు అశ్విన్ నా పాత్రను అద్భుతంగా తీర్చిదిద్దారు' అని మానస వారణాసి పేర్కొన్నది. సంతోష్ శోభన్‌కు జోడీగా ఆమె నటించిన రొమాంటిక్ లవ్‌స్టోరీ 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందింది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో మానస వారణాసి విలేకరులతో ముచ్చటించారు. 'ఆడిషన్ కోసం ఈ టీమ్‌ని కలిశాక, మూవీ మేకింగ్ పట్ల వీరెంత ప్యాషన్‌తో ఉన్నారో తెలిసింది. ఇది రొటీన్ ప్రేమకథ కాదు. మిత్ర, శివల ప్రపంచాలు వేరు. వారి లక్ష్యాలు వేరు. వేరే వేరే ప్రాంతాల నుంచి చెన్నై వస్తారు. అసలు ఇలాంటి జంట కలవడమే అరుదైన విషయం. సంతోష్ మంచి కోస్టార్. సినిమా పట్ల తనకు చాలా ప్యాషన్ ఉంది. తను పట్టుదలగా నటిస్తుంటే పక్కన వాళ్లకు కూడా ఎనర్జీ వస్తుంది. ఇందులో నేను బాగా చేశానంటే కారణం ఓ విధంగా సంతోష్ శోభనే' అని తెలిపింది.



# మరో బంపర్ ఆఫర్ అందుకున్న మృణాల్ ఠాకూర్

మంచి ఫేమ్ అండ్ మార్కెట్ అందుకోవడం అనేది హీరోయిన్స్‌కి అంత సాధ్యం అయిన విషయం కాదు. అందులోను హీరోయిన్ ల కెరీర్ ఇండస్ట్రీలో చాలా తక్కువ కాలం ఉంటుంది. ఎంట్రీ ఇచ్చిన కొన్నేళ్లలోనో, లేదా రెండు మూడు సినిమాల తర్వాతనో వారి కెరీర్ కి బ్రేక్ పడుతుంది. కానీ ఇంకొందరు మాత్రం జస్ట్ ఒక సినిమాతోనే తిరుగులేని ఆదరణ అందుకుని. జనాలకు చాలా దగ్గరైపోతారు. అలాంటి హీరోయిన్స్‌లో మృణాల్ ఠాకూర్ కూడా ఒకరు. కెరీర్ ఆరంభంలో బాలీవుడ్ సినిమాలో చాలా చిన్న చిన్న పాత్రలు, సీరియల్స్ చేసుకుంటూ ఉండేది మృణాల్. అక్కడ నుంచి మన తెలుగు సినిమాలోకి 'సీతారామం' తో ఎంట్రీ ఇచ్చి సీత గా చెరగని ముద్ర వేసుకుంది. తన అందంతో హోమ్లీగా కనిపించినప్పటికి, తదుపరి చిత్రాలల్లో తనలోని హాట్ యాంగిల్ ని కూడా చూపించింది. ప్రస్తుతం ఈ అమ్మడు చేతిలో వరుస ప్రాజెక్ట్ లు ఉన్నాయి.అయితే తాజాగా మృణాల్ మరో బిగ్ ఆఫర్ ని పట్టేసినట్టుగా సినీ వర్గాల్లో టాక్. అది కూడా హిందీలో ఓ క్రేజీ సీక్వెల్ లో నటిస్తోందట. ఇంతకి ఏంటా మూవీ అంటే. 2012 లో అజయ్ దేవగన్ హీరోగా చేసిన 'సన్నాఫ్ సర్దార్' మూవీ అంత చూసే ఉంటారు. ఇది ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'మర్యాద రామన్న' సినిమాకి రీమేక్ గా హిందీలో తెరకెక్కించారు. అయితే ఈ సినిమాకి తెలుగులో ఎలాంటి సీక్వెల్ లేనప్పటికీ హిందీలో మాత్రం సీక్వెల్‌ని ప్రకటించారు. కాగా ఇందులో మృణాల్ హీరోయిన్ గా ఆఫర్ అనుకున్నట్టుగా బాలీవుడ్ వర్గాల సమాచారం. దీని గురించి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. ప్రజంట్ మృణాల్ తెలుగులో అడివి శేష్ సరసన 'డెకాయిట్' అనే సినిమా చేస్తుండగా, హిందీలో కూడా బిజీగా మారింది.



# నాగబంధం కోసం..

1750 నేపథ్యంలో మైథలాజికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 15న మహాశివరాత్రి సందర్భంగా అగ్ర హీరో మహేష్‌బాబు టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. 1750 నాటి ఈ కథలో నాగబంధం సంప్రదాయంతో ముడిపడి ఉన్న పురాతన రహస్యాలను అద్భుతంగా ఆవిష్కరించారని, విజువల్స్ కట్టిపడేస్తాయని, వెండితెరపై ప్రేక్షకులు ఓ సరికొత్త ప్రపంచాన్ని వీక్షించిన అనుభూతికి లోనవుతారని చిత్రబృందం పేర్కొంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్, సంగీతం: అభే, జునైద్ కుమార్, నిర్మాతలు: కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అభిషేక్ నామా.